కథా నిలయం
శ్రీకాకుళం

# అలజడి

కాలేజీకొచ్చి, క్లాస్‌రూమ్‌లో తనసీట్లో కూచున్నదే గాని, మనసు స్థిమితంగా లేదు సుజాతకు - అవ్యక్తమైన ఆందోళనతో ఆమె, 'ఇలా' అని బయటికి చెప్పుకోలేని మూగ వేదనను అనుభవిస్తోంది... ఆలోచనలన్నీ తన వూరి చుట్టూ, ఇంటిచుట్టూ పరిభ్రమిస్తూ ఉన్నాయి... నిజానికి తాను ఈ రోజు కాలేజీకి రాకూడదు. కానీ ఊళ్లో ఉండటం చేతకాకనే ఇలా పరిగెత్తుకొచ్చింది.

నిన్నటి రోజు ఉదయం తాను నిద్రలేవగానే కన్పించిన దృశ్యం తన్ను ఇంకా వెంటాడుతూనే ఉంది. రోజూ లాగానే మసక చీకట్లోనే నిద్రలేచి, తలుపు తెరచుకొని బయటి కొచ్చింది తను. నడవలో నాలుగడుగులు వేసి వీధికి ఆ వైపున వున్న వేపచెట్టు వేపు మామూలుగానే చూసింది. ఏదో మార్పు కన్పించింది ఆ చెట్టులో. రెండు కొమ్మల మధ్య ఏదో తెల్ల ఆకారం. చిన్నపాటి భయం శరీరం మీద పాకినట్టయింది. మరో నాలుగడులు వేసి తేరిపార చూసింది కదా! వెంటనే గట్టిగా కెవ్వుమని అరచి, అలాగే నోరు తెరచే ఉండిపోయింది. అరిచిన అరుపు ఎంతగా శబ్దించిదో కాని ఇంట్లో నుండీ, పక్కిళ్ళ నుండి రెండు మూడు నిమిషాల్లో పది పండెండు మంది మూగినారు. తాను వేలు చూపించగా వేపచెట్టు వైపు చూడగానే, అందరి నోళ్ళనుండీ హాహాకారాలు మొదలయ్యాయి. అరుపులూ, కేకలూ, ఏడ్పులూ, రొదలూ పదినిమిషాల్లో ఆ ప్రాంతాన్నంతా మింగేస్తే తానింక అలాగే కట్టెలా బిగుసుకుపోయి చూస్తూనే వుంది.

చెట్టుకు పుల్లన్న మామ ఉరివేసుకున్నాడన్న వాస్తవం తాను తెలుసుకోవటానికి పదినిమిషాలు పట్టింది. 'మామా' అని అరుస్తూ కుప్పకూలిపోయింది తాను.

"ఎలాంటి పుల్లన్న మామ ఎలాంటి చావు చచ్చినాడు!" అనుకుంటేనే గుండెలు అలిసిపోతున్నాయి. పుల్లన్న మామ ఇలా ఉరేసుకొని చచ్చిపోతాడని ఊళ్ళో ఏ ఒక్కరైనా అనుకున్నారా, మొన్నటికి మొన్న సాయంత్రం తమ ఇంటికొచ్చి "అమ్మా సుజాతా,

ఒక గ్లాసుడు  కాఫీ ఈ తల్లీ" అని అడగటం, ఆ అడగటం వెనుక ఏదో భారం, తనకిప్పుడు  అర్థమవుతోంది.

తన నాన్నతో ఎప్పుడూ "సుజాతకు ఈ సంవత్సరం బి.ఏ. అయిపోతుంది గదా, బి.ఇడి. చేయించరా! టీచరవుతుంది. మరో టీచర్‌కిచ్చి పెళ్ళిచెయ్యి – అంతేగాని ఎంత భూమివున్నా సరే, రైతుకు మాత్రం పిల్లనివ్వద్దురా" అని గట్టిగా చెప్పేవాడు. జీవితానుభవం నుంచీ వచ్చిన మాటలేగాని ఆషామాషీగా చెప్పినవి కాదని ఇప్పుడర్థమవుతోంది  తనకు.

పుల్లన్న మామ, మంచి రైతుకిందే లెక్క ఊళ్లో! ముగ్గురన్నదమ్ములు విడిపోయినాక కూడ పదైదు ఎకరాలమెట్టా, రెండెకరాల తోటతో బాగా వున్న వాడికిందే జమ! ఒక కూతురూ, ఇద్దరు కొడుకులూ – మంచి భూములున్న కుటుంబమని పక్కవూళ్ళోకి తన కూతుర్నిచ్చి పెళ్ళి చేస్తే, ఆ పిల్ల బతుకు పేడా, గంజులో కూరుకుపోయింది. కొడుకులిద్దరూ హైస్కూల్ దాటకుండానే చదువులు మానేసి, పెళ్ళిళ్ళు చేసుకొని, సేద్యాలు చేసుకుంటున్నారు. పుల్లన్న మామకుకూడా అప్పులున్నాయని అందరికీ తెలుసు కాని ఇలా చచ్చేంత అప్పులున్నాయని, చనిపోయిన గంటకే బాహాటంగా తెలిసిపోయింది. బ్యాంకు అప్పులూ, ప్రైవేటు అప్పులూ, లక్షదాకా ఉండొచ్చునని వూళ్ళో అందరకూ తెలిసి ఆశ్చర్యం వేసింది తనకు.

"అప్పుల్లేని రైతు ఎవరున్నారమ్మా ఈ వూళ్ళో ఎంత చెట్టుకు అంతగాలి" అన్నాడు నాన్న తనతో.

"నాలుగేళ్ళయింది శనక్కాయపంట లేక – బావులు ఎండిపోయి, బోర్లు ఫెయిలయి ఆ తోట సేద్యం అట్లా అయిపోయింది. ఇంట్లో పదిమంది తినేవాళ్ళున్నారు. ఇంక అప్పులు పెరిగిపోక ఏముంది. అయినా ఇలాంటి చావు..." అంటూ కళ్ళనీళ్ళు తుడుచుకున్నాడు  నాన్న.

సుజాత కళ్ళనుండీ జలజలా నీళ్ళు దుముకుతూంటే ప్రక్కన కూచున్న కృష్ణవేణి, సుజాత ముఖాన్ని తనవేపు తిప్పుకొని "ఏమిటే" అంది అయోమయంగా. తాను క్లాసురూములో కూచున్నానన్న స్పృహ అప్పటికిగాని కలుగలేదు ఈమెకు. గబగబా కన్నీళ్ళు తుడుచుకొని "ఏం లేదు... ఏం లేదు..." అంటూ పాఠం చెబుతున్న లెక్చరర్ వైపు దృష్టి మరల్చింది సుజాత.

పది నిమిషాలు సేపు శ్రద్ధగా పాఠం విందేమో, అయినా ఆమెకు తెలీకుండానే ఆమె ఆలోచనలు పుల్లన్న మామ చుట్టే పరిభ్రమించ సాగినాయి....

నిరంతరమూ కష్టించే స్వభావముండే పుల్లన్న మామ ఇలా ఆత్మహత్య చేసుకోవటమే అనూహ్యంగా వుంది, ఊరందరికీ. తమ జిల్లాలో గత మూడేళ్ళుగా రైతుల ఆత్మహత్యలు జరుగుతున్న విషయం పత్రికల ద్వారా తాను చూస్తున్నదే.

ఆత్మహత్యలు చేసుకున్న రైతులందరూ, ఏదో ఒక విధమైన రుణభారానికి బలియైన వాళ్ళేనని కూడా పత్రికలు విడమర్చి చెబుతున్నాయి. చనిపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని రాజకీయ పార్టీలన్నీ కూడా ఉద్యమాలు లేవదీసినాయి. రుణాలు మాఫీచేసి రైతులు ఆత్మహత్యల పాలుపడకుండా కాపాడుకోవాలని ముక్తకంఠంతో నాయకులూ, సంస్థలూ ఆందోళనకు దిగుతున్న విషయమూ పత్రికల్లో తాను చదువుతున్నదే. "అయ్యో పాపం! రైతులిలా అన్యాయమైపోతే ఈ దేశం ఏం బాగుపడుతుంది" అని తాను ఎన్నోసార్లు నిట్టూర్చింది కూడా. ఈ మూడేళ్ళలోనే తమ జిల్లాలో రెండువందలకుపైగా రైతుల ఆత్మహత్యలు జరిగిన వార్తలు చదివి చదివి, విని విని మొద్దుబారిపోయింది తన మనసు. అయితే తమ గ్రామంలో ఇదే మొదటి చావు. అదీ తమ బంధువైన పుల్లన్న మామ. ఇంత దగ్గరగా ఇంత దారుణంగా చూసిన ఈ మరణాన్ని భరించలేకపోతున్నది సుజాత మనసు. జిల్లాలో రైతాంగం ఆత్మహత్యలు రోజూ పేపర్లో చదివి మొద్దుబారిన ఆమె మనసు, ఈ సంఘటనలతో మళ్ళీ ద్రవీభూతమై, ఆలోచనల్లో పడేసింది.

ఈ ఆలోచనల ప్రవాహంలో, ఒక్కసారిగా తమ కుటుంబం గుర్తుకొచ్చేసరికి, ఉలిక్కిపడింది సుజాత. తమ కుటుంబం మాటేమిటి? ఈ స్పృహ కలగగానే చిన్నపాటి వణుకు ప్రారంభమైంది ఆమె శరీరంలో.

తమ కుటుంబం కూడా పుల్లన్న మామ లాంటి కుటుంబమే! తమ తండ్రి కూడా ఒక రైతే. తమకూ ఇరవై ఎకరాల మెట్టభూమి వుంది. రెండు బోర్ల కింద నాలుగెకరాల తడి సేద్యం వుంది. ఆ బోర్లలో ఊరే నీళ్ళూ అంతంత మాత్రమే. కరెంటు సరిగాలేక, నీళ్ళు సరిగా పారక, పెట్టిన వరిపైరు ఒకవైపు కూడా వాడిపోతూ వుంది. కరెంటు బిల్లులు సరిగా కట్టనందున వారం క్రితం కరెంట్ ఆఫీసు వాళ్ళు దాడిచేసి స్టార్టర్‌ను ఊడదీసి తీసుకుపోయిన వైనం తమ కుటుంబం తల కొట్టేసినట్లుగా ఉంది. మెట్టలో ఈసారి వేసిన వేరుశనగ అసలు మొలకెత్తనే లేదు. గత నాలుగేళ్ళుగా పెట్టుబడులు కూడా గిట్టని సంగతి తనకూ తెలుసు. ఈ పరిస్థితుల్లో తలచుకోవటానికే భయం వేసింది ఆమెకు. తన తండ్రికి ఎన్నెన్ని అప్పులున్నాయో... శరీరమంతా ఒక్కసారిగా జలదరించింది సుజాతకు. తన తండ్రి కూడా పుల్లన్న మామలాగే...

"నాన్నా!" అని ఒక్కసారిగా గట్టిగా కేకవేసింది సుజాత. క్షణంలో క్లాస్‌రూమంతా నిశ్శబ్దమై పోయింది.... ఏమిటి.... ఏం జరింది? అంటూ చుట్టూ ముగినారు పిల్లలంతా. గట్టిగా ఏడుస్తూవుంది సుజాత. పక్కనున్న కృష్ణవేణితో పాటు మరికొందరు భుజాలు పట్టి వూపేసరికి, ట్రాన్స్‌లో నుండి బయట పడినట్టుగా ఈ లోకంలోకి వచ్చిపడి, అందరి వేపూ బిక్కుబిక్కుమని చూస్తూ బోరుమని ఏడ్చేసింది సుజాత.

పది నిమిషాల తర్వాతగాని తన పరిస్థితి ఏమిటో తనెక్కడవుందో అర్థంగాలేదు ఆమెకు. పక్కన కూచున్న స్నేహితురాండ్రు ఆమెను పొదివి పట్టుకొని, క్లాస్‌రూమ్

నుంచి నెమ్మదిగా బయటకు నడిపించి, ఒక చెట్టునీడలో వున్న బండలమీద కూచోబెట్టినారు ఆమెను. ఆమె కళ్ళనుండి నీళ్ళు కారుతూనే వున్నాయి. శరీరం వణుకుతూనే వుంది. కృష్ణవేణి బాటిల్‌లో నీళ్ళు వంచి ఆమె ముఖాన్ని తుడిచింది. బలవంతంగా నీళ్ళు తాపింది. నీళ్ళు తాగి పెద్దగా నిట్టూర్చి అందరి ముఖాల్లోకి అయోమయంగా చూస్తుండి పోయిందామె. మెల్లమెల్లగా, తమ వూళ్లో జరిగిన సంగతిని వివరంగా చెప్పింది అక్కడున్న వాళ్ళకు.

ఒక్కసారిగా అందరూ విషాదంలో పడిపోయినారు. ఆ విద్యార్థినులంతా కూడా గ్రామీణ ప్రాంతాల నుండీ, రోజూ బస్సుల్లో వచ్చి కాలేజీలో చదువుకుంటున్న వాళ్ళే. అందరి కుటుంబాలూ, వ్యవసాయం మీద ఆధారపడినవే. అందుకే అందరూ కూడా సుజాత విచారంలో భాగం పంచుకోగలిగినారు.

"ఏమీకాదు - ఏమీ భయపడవద్దు - ఒక్కరి కొచ్చిన కష్టమా ఇది" అంటూ ఓదార్చారు సుజాతను.

సుజాతను వాళ్ళవూరికెళ్ళే బస్సెక్కించారు స్నేహితురాండ్రు. "మరో రెండురోజుల పాటు కాలేజీకి రావద్దు - అనవసరంగా ఏవేవో ఆలోచనలు చేయొద్దు" అంటూ పంపించారు.

టౌన్‌కు పదికిలోమీటర్ల దూరంలో వుంది వాళ్ళవూరు. బస్సులో ప్రయాణిస్తున్నా, తన తండ్రి గురించే దిగులుగా ఉంది ఆమె మనసు. నాన్నకు కూడా చాలా అప్పులుంటాయి అని ఘోషిస్తోంది ఆమె అంతరాత్మ. తన అక్క పెళ్ళికే బోలెడు ఖర్చయింది. అదీ ఒక ఉద్యోగికిచ్చి కట్నకానుకలతో చేసిన పెళ్ళి. ఇక తన చదువూ, బట్టలూ, ప్రయాణాలు ఈ ఖర్చులన్నీ ఎలా భరించగలిగాడు నాన్న - ఏకీడు జరుగకుండుగాక అని ఆరాటపడుతోంది ఆమె.

ఊళ్లో బస్సుదిగి పరుగు పరుగున ఇంటికి చేరుకుందామె. గడపలో అడుగు పెట్టగానే, 'నాన్నా నాన్నా' అని కేకలేసిందామె. లోపల్నుంచీ ఆమె తండ్రి గబగబా బయటకొచ్చి, ఏమ్మా ఏమిటీ అలా అరుస్తున్నావ్ అన్నాడు గాభరాగా. అమ్మయ్య అని వూపిరి పీల్చుకుందామె.

సుజాత తండ్రిని పట్టుకొని ఏదో ఉద్వేగం ఎగదన్నగా బావురుమని ఏడ్చింది. ఏదీ అర్థంగాక విస్తుపోతున్నాడు తండ్రి.

"పుల్లన్న మామే గుర్తుకొస్తున్నాడు నాన్నా - నువ్వు ఏమౌతావో అని భయంగా ఉంది నాన్నా" అంది వణకుతున్న గొంతుతో. అతనికి కూతురు మనసు అర్థమయింది.

"ఎందుకమ్మా అలా ఆలోచిస్తావ్! నేను ధైర్యంగా జీవితాన్ని ఎదుర్కొంటాను. నా అప్పులు నన్నేమీ చెయ్యవు. నువ్వు లేనిపోని ఆలోచనలతో మనసును పాడుచేసుకోకు" అంటూ తానే కుమార్తెను ఓదార్చాల్సి వచ్చింది.

"నీ తండ్రి ఒక్కడే కాదమ్మా రైతు. జిల్లాలో లక్షలాది మంది రైతులిప్పుడు చావా? బతుకా? అన్న సందిగ్ధంలో ఉన్నారు. ప్రపంచీకరణ ఆర్థిక విధానాలు పెనుభూతంలా వ్యవసాయరంగాన్ని దారుణంగా మింగేస్తున్నాయిప్పుడు - ప్రపంచబ్యాంకు కనుసన్నల్లో ప్రభుత్వాలు నడుచుకొనే కాలం దాపురించింది. ఆ కారణంగా వ్యవసాయరంగానికి ప్రభుత్వం తాను యిచ్చే అన్నిరకాల సబ్సిడీలనూ, రాయితీలనూ ఉపసంహరించుకుంది. ఈ ఐదేళ్లలోనే రైతులు వ్యవసాయానికి పెట్టే పెట్టుబడులన్నీ రెట్టింపయినాయి. రైతు పండించే పంటల ధరలేమో పెరగలేదు - ఎంతమంచి పంట పండించినా గిట్టుబాటుగాని పరిస్థితి వచ్చేసి రైతులంతా రుణభారంలో కూరుకుపోయినారమ్మా! అవి తీర్చలేకనే ఈ ఆత్మహత్యలు! రైతులు ఆత్మహత్యలకు పాల్పడకుండా ఆత్మవిశ్వాసం కల్గించటం ఇప్పుడు అందరి కర్తవ్యం"- అంటూ ఒక కరపత్రాన్ని ఆమె చేతికిచ్చి, "మధ్యాహ్నం కొంతమంది కళాకారులు మనవూరు వచ్చి ఈ కరపత్రాలు పంచినారు. ఆత్మహత్యలు చేసుకోకండి. ధైర్యంగా సమస్యల్ని ఎదుర్కోండి" అంటూ డప్పులు వాయిస్తూ పాటలు పాడినారు. ఊరంతా వాల్‌పోస్టర్లు అతికించినారు" అన్నాడు.

సుజాత ఆ కరపత్రం వేపు చూసింది. "రైతన్నలారా! ఆత్మహత్యలకు పాల్పడకండి. ఆలు బిడ్డలున్నారని మరవకండి" అన్న హెడ్డింగ్‌తో ఆ కరపత్రం వుంది. దాన్ని దీక్షగా చదివించి సుజాత. "మన జిల్లాలో కరువు పరాకాష్ఠకు చేరుకున్న స్థితిలో మనం ఈనాడున్నాము.. మన రైతు సోదరులు కోలుకోలేని దెబ్బలతో భవిష్యత్తుపట్ల ఆశలు నీరసించి, జీవనోత్సాహం కోల్పోయి క్రమక్రమంగా ఆత్మహత్యలకు పాల్పడటం ఒక విషాద ఘట్టం. ఓ రైతన్నా, చావు సమస్యకు పరిష్కారం కాదు. అది మరికొన్ని సమస్యల్ని పెంచుతుంది. మీరు ఒంటరివారు కారు. అనంత ప్రజాసమూహం మీ వెంటవుంది. ఆత్మహత్యల ఆలోచనే చేయవద్దు ఏ సమస్యనైనా పోరాటం ద్వారానే పరిష్కరించుకోవాలి!" అంటూ మొదలైన ఆ కరపత్రాన్ని చివర వరకూ గట్టిగా చదివి, జలజలా కన్నీరు కార్చింది సుజాత.

కొంతసేపు తర్వాత కన్నీళ్లు తుడుచుకొని, ఒక నిశ్చయానికి వచ్చిన దానిలా "నాన్నా, నేను కూడా ఆ కళాకారుల బృందంతో వెళ్లి జిల్లా అంతా తిరుగుతాను. నాకు చక్కగా పాటలు పాడటం వచ్చు. నేను కూడా ఈ ఆత్మవిశ్వాస యాత్రలో భాగం పంచుకుంటాను" అంది కళ్లలో పట్టుదల, ప్రేమ ప్రతిఫలిస్తూండగా.

● *కదలిక - నవంబర్, 2002* ●